క్లుప్తంగా

శ్రీకృష్ణుడికి పౌర్ణమి పూజలు



శ్రీకృష్ణుడికి మహిళల పౌర్ణమి పూజలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో వెలసిన శ్రీకృష్ణ పరమాత్మకు శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయలలో ఉంచి పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆస్తి పన్నులపై వడ్డీ మాఫీ లేదు



కమిషనర్ ఎం.మంజునాథగౌడ్

పుత్తూరు: ఆస్తి పన్నులపై విధించిన వడ్డీ మాఫీ చేయడం లేదని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వడ్డీ మాఫీ లేని విషయాన్ని గుర్తించి ఇంటి, నీటి, ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి, పుత్తూరు పురపాలక సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సెలవు దినాలైన ఆదివారాల్లో సైతం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ సీడీఎంఏ వెబ్‌సైట్‌లో కూడా పన్నులు చెల్లించ వచ్చునని వెల్లడించారు.

12 లీటర్ల నాటుసారా స్వాధీనం

గంగాధరనెల్లూరు: అక్రమంగా నాటుసారా అమ్ముతుండగా ఇద్దరు మహిళలను ప్రత్యేక తనిఖీల్లో భాగంగా చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి అరెస్టు చేసినట్లు మీడియాకు తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు నాటుసారా తయారీ, అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రకటించిన నవోదయం 2.0లో భాగంగా శుక్రవారం గంగాధరనెల్లూరు మండలం వింజం గ్రామ సమీపంలో తనిఖీలు చేపట్టారు. కళావతి(48) అనే మహిళ ఆమె నివాసం వీఎల్‌ఆర్ పల్లి వద్ద అక్రమంగా సారాయి అమ్ముతుండగా అరెస్టు చేశారు. 2 లీటర్లు నాటుసారా స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. అదే విధంగా పెనుమూరు మండలం విడిది పల్లి గ్రామంలో శారద అనే మహిళ వద్ద 10 లీటర్ల సారాయిని స్వాధీన పరచుకుని ఆమెను అరెస్టు చేసి తెలిపారు. అరెస్టు అయిన ఇద్దరు మహిళలను చిత్తూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఇద్దరికీ రోజులు 15 రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఘనంగా 'పై' డే



పై విలువను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: వృత్తపరిధికి, వ్యాసానికి గల నిష్పత్తి గణిత స్థిరాంకం అంతర్జాతీయ పై డేను డీఎం పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వృత్త పరిధికి, వ్యాసానికి గల నిష్పత్తి పై అని విదార్థులు స్కూల్ బ్యాగ్‌లు, ప్లేట్లపై ప్రదర్శించారు. పీడీ తిరుమలరాజు తన కుమారుడు రూపేష్ జన్మదినం సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు భోజనం ప్లేట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం 15 దశాంశ స్థానాల వరకు పై విలువని విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్‌ఎం కేశవులు, త్యాగరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యంత్ర సాయం

పంటలే ప్రాణంగా భావించే రైతన్నలు కొత్త పుంతలు తొక్కుతూ సులభ మార్గాల్లో వ్యవసాయం చేస్తున్నారు. ఎంతో కష్టంగా భావించే వ్యవసాయాన్ని గత ప్రభుత్వం సహకారంతో సులభతరంగా చేశారు. సేద్యంలో ఆధునికత ఉపయోగిస్తుండడంతో విద్యావంతులు సైతం పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. యువరైతులు నూతన ఒరవడితో ఆదర్శంగా నిలుస్తున్నారు. విత్తడం మొదలు కోతల వరకూ యంత్రాలను విరివిగా వినియోగిస్తూ పంటల సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు. –కార్వేటినగరం



యంత్రం ద్వారా వరి కోత నూర్పిడి, (ఇన్‌సెట్) యంత్ర సహాయంతో వరినాట్లు

- ఆధునిక సేద్యం.. సులభతరం
- నూతన వ్యవసాయ విధానాలపై ఆసక్తి
- పెరిగిన యంత్రాల వినియోగం

జిల్లాలో అత్యధికంగా వేరుశనగ, వరి, మామిడి, మొక్కజొన్న, బొప్పాయి, కూరగాయలు, టమాటా తదితర ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. అయితే కూలీల కొరత ఎక్కువగా ఉన్న ప్రస్తుత రోజుల్లో యంత్రాల సహకారంతో పంటల సాగు చేపట్టారు. విత్తన గొర్రు, వరిమడి దున్నకం, నాటడం, చివరకు కోతల సమయంలోనూ యంత్రాలనే వాడుతున్నారు. కలుపు అధికంగా ఉన్న పంటల్లో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేపట్టి కూలీల కొరతను అధిగమిస్తున్నారు.

ఆధునిక సేద్యానికి యంత్ర సాయం

గత ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని విధాలుగా రైతులను ప్రోత్సాహించారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, వరి కోత మిషన్లు, మందుల పిచికారీకి స్ప్రేయర్లను రాయితీపై అందజేశారు. దీంతో వైఎస్ఆర్ సీపీ హయాంలో 372కు పైగా ట్రాక్టర్లు, వందల కొద్దీ వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని సొంతదారులు వ్యవసాయంలో ఉపయోగించడంతోపాటు ఇతరులకు అద్దెకు ఇచ్చి మరింత ఆదాయాన్ని గడించారు. జిల్లాలో వరి కోత మిషన్ల ధర ఎక్కువగా ఉండడంతో సమీపంలోని తమిళనాడు నుంచి అద్దెకు తీసుకొచ్చి ఉపయోగిస్తున్నారు. ట్రాక్టర్, రోటోవేటర్, పొలం దుక్కి, చదును చేయడానికి, విత్తన గొర్రు, కోత మిషన్లు, మందులు పిచికారీకి ఇంత వరకూ స్ప్రేలు వాడుతుండగా ఇటీవల డ్రోన్‌ల ద్వారా పిచికారీ ఊపందుకుంది.

సమయం ఆదా

వ్యవసాయ యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత సమయం చాలా వరకూ ఆదా అవుతోంది. గతంలో 5 ఎకరాల విస్తీర్ణంలో విత్తనం వేయడానికి ఎడ్ల సాయంతో రెండు రోజులు పట్టేది. ప్రస్తుతం ట్రాక్టర్ సహాయంతో గంటల వ్యవధిలోనే పని పూర్తవుతోంది. వరి కోత విషయంలో కూడా యంత్ర సహాయంతో కూలీలతో ఇబ్బందులు లేకుండా గంటల వ్యవధిలోనే నూర్పిడి అవుతోంది. ఇలా అనేక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయం సులభతరంగా మారింది.



వరి గడ్డిని చుడుతున్న ట్రాక్టర్

సబ్సిడీలో యంత్రాలు అందజేశారు



గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో రూ.15 లక్షల విలువ చేసే ట్రాక్టర్, వేరుశనగ నూర్పిడి యంత్రం, రోటోవేటర్, మడకలు మంజూరయ్యాయి. 40 శాతం సబ్సిడీ మొత్తాన్ని వెంటనే అందజేశారు. యంత్రాలతో వ్యవసాయం చాలా సులువైంది. నా వద్ద ఉన్న యంత్రంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. రైతులకు అద్దెకు కూడా ఇస్తున్నాను.

–మురగయ్య, రైతు, గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం

పని సులువుగా మారింది



నేను మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యవసాయం చేయాలంటే కూలీల కొరతతో ఇబ్బందులు పడేవాళ్లం. ఉద్యోగ విరమణ పొందాక 11 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. నాట్లు వేసేందుకు యంత్ర సహాయంతో గంటల వ్యవధిలోనే పూర్తి చేసుకుంటున్నాం. యంత్రాలతో వ్యవసాయం చేయడంతో కూలీల కొరతతోపాటు, ఖర్చు కూడా తగ్గింది. సమయం ఆదా అవుతోంది.

–బాలకృష్ణయ్య, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరుగు సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టండి



పోలీసు స్టేషన్ వద్ద జేసీబీ

నింద్ర: మండలంలోని కొప్పేడు కాజ్ వే వద్ద ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాజ్‌వే వద్ద నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ఆ ప్రాంతం గుంతలుగా మారింది. భూగర్భ జలాలు అంతరించపోతున్నాయని, పంటలు సాగు చేయడానికి నీరు అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు రోజుల క్రితం ఇసుకను జేసీబీ సహాయంతో ట్రాక్టర్లకు నింపుతుంటే స్థానికులు నగరి డీఎస్పీకి సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి జేసీబీని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అయితే కేసు నమోదు కాలేదని వారు తెలిపారు. ఇకనైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్, జేసీబీ సీజ్

గంగాధరనెల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానా విధించినట్లు జీడీనెల్లూరు తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ముక్కళ్లతూరు వద్ద నీవానదిలో జేసీబీ సాయంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో సీఐ శ్రీనివాసంతి దాడులు చేపట్టారు. ఇసుక తరలిస్తున్న జేసీబీ, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహశీల్దార్‌కు అప్పగించారు. జేసీబీకి రూ.50వేలు, ట్రాక్టర్‌కి రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేకలో మాజీమంత్రి ఆర్కే రోజా, మేరిజయరాంను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

- వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: మున్సిపల్ పరిధి కొత్తపేట శ్రీఅగరవినాయక, వళ్లిదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేక ఉత్సవాలు శుక్రవారం వైభవంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అవభృత యాగశాల పూజ, విశేష ద్రవ్య ఆహుతి, మహా పూర్ణాహుతి, యాత్రాదానం పూజలు నిర్వహించారు. కలశ ధీపారాదన అనంతరం విమాన కలశ గోపురాలకు కుంభాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీఅగరవినాయక, శ్రీవళ్లిదేవసేనా సమేత సుబ్రమణ్యస్వామి విగ్రహాలకు మహాభిషేకం చేశారు. ఈ పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు ఆమెకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ప్రసాదాలతో ఆలయ వేద పండితులు మాజీమంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైఎస్ఆర్ సీపీ మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీడీ భాస్కర్, వీవర్స్ విభాగం అధ్యక్షుడు బాలకృష్ణన్, క్రియాశీలక కార్యదర్శి మురుగయ్య, నాయకులు మోహన్‌రాజ్, మనోహర్, భూపాలన్, ఇలంగో, బీఆర్వీ అయ్యప్పన్, కన్నాయిరం, అముద, భారతి, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

నింద్ర: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బధ పడుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులను శుక్రవారం మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం పరామర్శించారు. జీఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన నాయకుడు ఆనందయ్యను పరామర్శించారు. నింద్రలో రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి మేరీ జయరాంను పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కావునూరు ఎంపీటీసీ విజేష్‌కు చేతి గాయం కావడంతో ఆయన్ను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, రాష్ట్ర యవజన కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, సర్పంచ్ బాబురెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

రైతులను నిలువునా ముంచారు



ధర్నా చేస్తున్న మాజీ ఎంపీ చింతా మోహన్

నగరి: కూటమి ప్రభుత్వం రైతును నిలువునా ముంచిందని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రైతు సమస్యలపై ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి పదినెలలు అవుతున్నా రైతుకు ఎలాంటి సాయం అందలేదన్నారు. ఇప్పటికే ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతు దయనీయ పరిస్థితిలో ఉన్నాడన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానన్న కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఓబీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందడం లేదన్నారు. రాష్ట్రంలోనే జిల్లాలో పవర్‌లూమ్ కార్మికులు ఎక్కువగా ఉన్నారని వారికి ఇస్తానన్న 500 యూనిట్ల ఉచిత కరెంటును కూడా కూటమి అమలు చేయడం లేదన్నారు. స్థానిక నాయకులు బాబు, చిరంజీవిరెడ్డి, కుమార్, గుణ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



సరస్వతి పూజ

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి పూజ నిర్వహించి విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో నూరు శాతం ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్ విద్యార్థులను ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేష్, గోపి, విజయవర్మ, వెంకమరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల రంగేళి



హోలీ వేడుకల్లో మార్వాడీలు

నగరి: రంగు రంగుల హోలీ.. ఆనందాల రంగేళిగా నిలిచింది. స్థానిక మార్వాడీలు నెత్తకండ్రిగ వద్ద ఉన్న శ్రీనివాసా కళ్యాణమండపం సమీపంలో సోమవారం హోలీ వేడుకలు నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ, డ్యాన్సులు చేస్తూ సంతోషంగా గడిపారు. రంగులు పట్టుకుని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ప్రతి ఏడాది ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు హోలీ పండుగను నిర్వహించుకుంటామని మార్వాడీలు తెలిపారు. వడమాలపేటలోనూ హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కోలాహలంగా శుక్రవారం హోలీ పండుగ సంబరాలు నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ పరస్ప రంగులు చల్లుకున్నారు. శ్రీకావేరిరాజుపురం, సన్నగుంట గ్రామాల్లోని గిరిజనులు తమ సాంప్రదాయ బద్ధంగా పండుగను నిర్వహించారు. ఎండు ఆవు పేడతో జొన్న రొట్టెలను కాల్చి బంధుమిత్రులకు పంచారు. శ్రీకావేరిరాజుపురం, వెంగళరాజుకుప్పం, పాలసముద్రం గ్రామాల్లోని చిన్నారులు ఉట్టి కొట్టి రంగులు చల్లుకుని ఉల్లాసంగా హోలీ వేడుకలు చేపట్టారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల ప్రజలు హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట తదితర ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. గ్రామాల్లో సైతం పిల్లలు హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: హోలీ పండుగ వేడుకలను శుక్రవారం రాజస్తాన్ మహిళలు, పురుషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుని రాజస్తాన్ ఆనవాయితీ ప్రకారం నృత్యాలు చేశారు. అనంతరం వారి ఇష్ట దైవానికి ప్రత్యేక పూజలు చేపట్టి, మొక్కులు తీర్చుకున్నారు. కార్వేటినగరం యువతీ యువకులు కూడా హోలీ సందర్భంగా రంగులు చల్లుకుంటూ వీధుల్లో హుషారుగా కనిపించారు. రాజస్తాన్ మహిళలు సినీ సంగీతాలకు చేసిన నృత్యాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి.

అయ్యప్పకు ఉత్తరా నక్షత్ర పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. ధీర్‌వినాయక్, హర్షిత ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామివారి ఊరేగింపు

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): మండల పరిధిలోని మంగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యాహవచనం, కలశారాధన, మూలవర్లకు అభిషేకం కలశ స్థాపన నిర్వహించారు. మహా శాంతి హోమం, మహా సంకల్పంతో సంపూర్ణ పూర్ణాహుతి, బలిహరణం, ధ్వజావరోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి ఆలయ ఆవరణలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవమూర్తులకు పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలతో తిరుమంజనం నిర్వహించారు. 10వ రోజు ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉభయదారులు వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఆవరణను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త టి.రమణ ప్రసాద్‌రెడ్డి, అర్చకులు వెంకటాచలపతి ఆచారి, చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.